క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

నల్లకుంట: నల్లకుంట సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్ల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రావు, అధ్యక్షుడు పుల్లయ్య, కార్యదర్శి రంగయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈరోజు శంకరమఠ పద్మకాలనీ కమ్యూనిటీహాల్‌లో ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ఈ శిబిరంలో ముషీరాబాద్ కేర్ ఆసుపత్రి వైద్యులు వృద్ధులకు బీపీ, షుగర్‌తో పాటు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి వారికి అవసరం మేరకు వైద్య సలహాలు, సూచనలు ఇస్తారని చెప్పారు. నల్లకుంట, విద్యానగర్, డీడీకాలనీ, బాగ్‌లింగంపల్లి, అచ్యుతరెడ్డి మార్గ్, అచ్చయ్యనగర్ పరిసర ప్రాంతాల్లోని వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



బస్తీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: బస్తీలలో నెలకొన్న సమస్యలు తెలుసుకుని తక్షణ పరిష్కారానికి తగిన చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. బస్తీల్లో ప్రజా సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే తక్షణ పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. శుక్రవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని సంజయ్‌గాంధీనగర్, అంజయ్యనగర్‌లో జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ఏ శక్తి అడ్డు కోలేదు !



మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

ముషీరాబాద్: అగ్రవర్ణ పేదలకు కల్పించిన 10 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూ.. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ఏ శక్తులు అడ్డుకోలేవని స్పష్టమైందని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి అన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో ఆర్థికంగా వెనుకబడిన అగ్రకులాలకు కల్పించిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను పునఃసమీక్ష జరపాలన్న పిటీషన్లను సుప్రీంకోర్టు కొట్టివేయడం హర్షించదగిన పరిణామమని ఆయన పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో అగ్రవర్ణపేద రిజర్వేషన్లకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోర్టు తీర్పును పరిగణలోకి తీసుకుని ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను సక్రమంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సామాజిక వివక్షతతో పాటు ఆర్థిక వివక్షత కొనసాగుతున్న నేపథ్యంలో మేజర్ జనరల్ సిన్హా నివేదిక ఆధారంగా 103వ రాజ్యాంగ సవరణ ద్వారా అమలు చేయబడిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు కొన్ని శక్తులు కుట్ర పన్నడం తగదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏ సామాజిక వర్గానికి చెందిన రిజర్వేషన్లకు నష్టం కలగకుండా కేవలం అగ్రవర్ణ పేదలకు మాత్రమే అదనంగా 10శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడు కొన్ని ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, వ్యతిరేకించడం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 6 కోట్ల మందికి పైగా నిరుపేద ఓసీలను ఆర్థికంగా ఆదుకునేందుకు తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష కోట్లు కేటాయించి జాతీయ ఓసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లోకి దోమలగూడ పీఎస్

చిక్కడపల్లి: హైదరాబాద్ నగరంలో నూతన పోలీస్‌స్టేషన్ల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఏర్పాటైన దోమలగూడ పోలీస్‌స్టేషన్ ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా గాంధీనగర్ డివిజన్ పరిధిలోకి వచ్చే ఈ స్టేషన్ బోర్డును సైతం ఏర్పాటు చేశారు. స్టేషన్‌కు నూతనంగా ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన శ్రీనివాస్‌రెడ్డి శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. దోమలగూడ పోలీస్‌స్టేషన్ భవనంపై అంతస్తులో చిక్కడపల్లి పోలీస్ సబ్ డివిజన్ ఏసీపీ కార్యాలయం యాధావిధిగా కొనసాగుతుంది.

రైలు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ప్రమాదంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా ఇస్కబాయి తాండకు చెందిన దేవ్లుల నాయక్ (57) ఈనెల 8న కాచిగూడ రైల్వే స్టేషన్‌లో కదులుతున్న రైలు ఎక్కుతూ.. ప్రమాదవశాత్తు కిందపడి రెండు కాళ్లు విరిగిపోయాయి. అతడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని వైద్యులు ప్రకటించారు. కాచిగూడ రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎ.నమ్మయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి



బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: ప్రజల ఆరోగ్యం విషయంలో సీఎం కేసీఆర్ చేపట్టిన సంస్కరణలు దేశానికే ఆదర్శమని రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం గోల్నాక డివిజన్ సుందర్‌నగర్ బస్తీలో నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ దూసరిలావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం బస్తీ దవాఖానాల ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్యమే అన్నింటికంటే ముఖ్యమని వారి నివాసాలకు దగ్గరగా నగరంలో ప్రతి 10 వేల మందికి ఒక దవాఖానా చొప్పున వేయి బస్తీదవాఖానాలను దశలవారీగా ఏర్పాటు చేసి ఆరోగ్యభద్రతను కల్పిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు చొరవతో బస్తీ దవాఖానాలు అత్యంత వేగంగా అందుబాటులోకి వచ్చాయన్నారు.

- పేద ప్రజల ఆరోగ్యానికి బస్తీ దవాఖానాలు భరోసాగా నిలుస్తాయని వీటిలో ఓ డాక్టర్, స్టాఫ్ నర్స్ అందుబాటులో ఉంటారని చెప్పారు.
- ఓపీ, ప్రాథమిక రోగ నిర్ధారణ పరీక్షలు, గర్భిణీలు, బాలింతలకు పరీక్షలు, టీకాలు వేయడం, కుటుంబ నియంత్రణ కౌన్సెలింగ్, రక్తహీనత, షుగర్, బీపీ, కేన్సర్ పరీక్షలు, ఇతర ప్రాథమిక చికిత్సలను నిర్వహిస్తున్నామన్నారు.
- 57 రకాల వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని అత్యవసర సమస్యలకు రెఫరల్ ఆసుపత్రులను సీహెచ్‌సీలు, ఇతర ప్రభుత్వ దవాఖానాలకు ఇక్కడి సిబ్బంది సిఫార్సు చేస్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు దిడ్డి రాంబాబు, లింగంగౌడ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కాచిగూడ: ప్రజల ఆరోగ్య సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు మెంబర్ దడువై రాఘవేందర్ అన్నారు. కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్య హాల్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన పాల్గొని ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. నిర్లక్ష్యం, అవగాహన లోపం కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడతున్నారన్నారు. మూడు నెలలకోసారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్స్ కార్డియాలజీ డాక్టర్ కావ్యాఅన్నపరెడ్డి మాట్లాడుతూ.. మారిన జీవన విధానంతో గుండె జబ్బుల బారినపడుతున్నారన్నారు. గుండె సంబంధిత వ్యాధులపై ఆమె ప్రజలకు అవగాహన కల్పించారు. ఉచితవైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదల కోసం పలు బస్తీలు, కాలనీల్లో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. బీపీ, షుగర్, ఆర్‌బీఎస్, బీఎండీ, వెయిట్‌చెక్, హైట్‌చెక్, ఈసీజీ, లంగ్స్ ఫంక్షన్ టెస్ట్, కార్డియాలజీ తదితర విభాగాలకు చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు పాల్గొని రోగులకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు మేనేజింగ్ ట్రస్టీ ఆకుల పాండురంగం, మంద సూర్యప్రకాష్, డాక్టర్ కొండా శ్రీనివాస్‌రావు, డాక్టర్ రావర్తి తారా తదితరులున్నారు.

నిత్య జనగణమనలో ఎంపీ లక్ష్మణ్



జాతీయ జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

నల్లకుంట: జాతీయ పతాక స్ఫూర్తితో భారత్ విశ్వగురువుగా వెలుగొందుతుందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. నిత్యజనగణమన వార్షికోత్సవ సంబరాలను పురస్కరించుకుని శుక్రవారం నల్లకుంట శివానంద్‌నగర్‌లో జెండా కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయజెండా ఆవిష్కరించిన లక్ష్మణ్ మాట్లాడుతూ.. జెండా ఆవిష్కరణను నిత్యం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, నగర నాయకులు ఎంటీ. కిషోర్‌కుమార్, సురేష్‌యాదవ్, సంధ్యారాణి, మహేందర్, యాదగిరి, వీరయ్యగౌడ్, సునిల్, నిత్య జనగణమన నిర్వాహకులు లీడర్స్ ఫర్ సేవ ఆర్గనైజేషన్ సభ్యులు నేలంటి మధు, క్రాంతి, జూకంటి ప్రశాంత్, అశోక్, ప్రసాద్‌దూబే, ఎంకే. శ్రీనివాస్, అరవింద్‌రాజ్, నవీన్, విజయేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళాశాల వార్షికోత్సవం

కాచిగూడ: విద్యానగర్‌లోని ఏఆర్‌కే డిగ్రీ అండ్ పీజీ కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఏఆర్‌కే విద్యాసంస్థల చైర్మన్ ఎ.పరమేశ్వర్ మాట్లాడుతూ.. కళాశాల స్థాయిలోనే విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని అప్పుడే ఉన్నత స్థానానికి చేరుకోగలుగుతారన్నారు. విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించి నిర్దేశించుకున్న లక్ష్యం వైపు సాగాలని సూచించారు. పోటీ ప్రపంచంలో ప్రతిభావంతులకే ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయన్నారు. ఇంజినీర్లు, వైద్యులకే కాకుండా ఇతర చదువులు చదివిన వారికి కూడా అవకాశాలున్నాయని పేర్కొన్నారు. పిల్లలను తల్లిదండ్రులు ఎన్నో కష్టాలను భరించి చదివించి గొప్పవాళ్లను చేయాలని కలలు కంటారన్నారు. వారి కలలను నిజం చేసేందుకు ప్రతి విద్యార్థి చదువులో ముందుండాలని సూచించారు. ఆటపాటల్లోనూ రాణించి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కళాశాల వైస్ చైర్మన్ లక్ష్మి, ప్రిన్సిపాల్ ఉదయ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీవిద్యార్థులు తదితరులున్నారు.



ర్యాంప్ వాక్‌తో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

బాలల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత

చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ శైలజారావు



ర్యాలీలో పాల్గొన్న సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ శైలజారావు

కవాడిగూడ: బాలల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత అని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) చైర్‌పర్సన్ శైలజారావు అన్నారు. ముషీరాబాద్‌లో బాలల హక్కుల పరిరక్షణపై హైదరాబాద్ జిల్లా పీపుల్స్ యాక్షన్ ఫర్ రూరల్, పారా స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... హైదరాబాద్ జిల్లాలోని 40 ప్రభుత్వ పాఠశాలల్లో బాలల సంఘాలను ఏర్పాటు చేసి వారి హక్కులపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా కృషి చేయడం అభినందనీయమన్నారు. సీడీపీఓ సునంద, బాలల సంరక్షణ జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ.. బాలలకు ఎలాంటి సమస్య వచ్చిన 1098 ఫోన్‌లో తెలియజేస్తే వాటిపై స్పందించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌యాదవ్, జాతీయ యువజన పురస్కార గ్రహీత పాసుగంటి మహేష్, నాయకులు అంబేడ్కర్, నాగేష్, కిషోర్ తదితరులున్నారు.

వ్యక్తి దారుణ హత్య

చిక్కడపల్లి: బాగ్‌లింగంపల్లిలో బండరాయితో మోది గుర్తుతెలియని వ్యక్తులు ఒకరిని హత్య చేసిన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎస్.సంజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్ మండలం మేడిపల్లి ప్రాంతానికి చెందిన లక్ష్మయ్య (50)ను దుండగులు దారుణంగా హత్య చేశారు. అతడు బాగ్‌లింగంపల్లి అంబేడ్కర్ కాలేజ్ ప్రధాన గేటు పక్కనున్న ఫుట్‌పాత్‌పై నివాసం ఉండేవాడు. తలపై బండరాయితో బలంగా కొట్టి హత్య చేసినట్లుగా పోలీసులు తేల్చారు. ఈ ఘటనకు గల కారణాలు తెలియరాలేదు. ఇలాంటి ఘటనే మూడు నెలల క్రితం వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఫుట్‌పాత్‌పై గతంలో జరగడం గమనార్హం. హత్యకు గల కారణం యాచకుల మధ్య గొడవే కారణమని పోలీసులు భావిస్తున్నట్లు సమాచారం. హత్యకు పాల్పడిన వారిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రత్యేకబృందాలను సైతం ఏర్పాటు చేశారు. కాగా హత్య జరిగిన స్థలంలో క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్ ద్వారా ఆధారాలను సేకరించారు. చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి ఘటనా స్థలాన్ని సందర్శించి సమీక్షించారు.

డ్రైనేజీ పైప్‌లైన్ల ఆధునీకరణకు చర్యలు



పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ సుప్రియ

ముషీరాబాద్: నియోజకవర్గంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్లను యుద్ధప్రాతిపదికన ఆధునీకరిస్తున్నట్లు ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్‌లోని జెమిస్తాన్‌పూర్ పోస్టాఫీస్ వీధిలో రూ.4.50 లక్షల డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణపనులు, అరుణ కో- ఆపరేటివ్ సొసైటీ వీధిలో రూ.3.80 లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పైప్‌లైన్ పనులు పూర్తయిన వెంటనే రోడ్డు నిర్మాణ పనులను చేపడతామన్నారు. జెమిస్తాన్‌పూర్ పోస్టాఫీసు వీధిలో అస్తవ్యస్తంగా మారిన పైప్‌లైన్‌లను ఆధునీకరించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు ముఠా జైసింహ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్ ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, పూసగోరక్‌నాథ్, డివిజన్ ఉపాధ్యక్షుడు బల్ల ప్రశాంత్, డివిజన్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ భక్తియార్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు బద్రినారాయణ, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్, నియోజకవర్గ కన్వీనర్ గడ్డం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యల పరిష్కారంపై హర్షం



ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించేందుకు క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై తెలంగాణ వీఆర్‌ఏల హక్కుల సాధన సమితి హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా బాగ్‌లింగంపల్లిలో శుక్రవారం సమితి చైర్మన్ ఆర్.విజయ్ మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా సమస్యల పరిష్కారం కోసం ఎదురు చూసున్న 23 వేల మంది వీఆర్‌ఏలకు ప్రభుత్వం పే స్కేలు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇవ్వటం, ఉద్యోగాలను క్రమబద్ధీకరించడం తదితర సమస్యలను పరిష్కరించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్సీ, రైతుబంధు రాష్ట్ర చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవ తీసుకొని తమ సమస్య పరిష్కారానికి కృషి చేసినందుకు అభినందనలు తెలుపుతూ.. సత్కరించినట్లు చెప్పారు.


నైపుణ్యంతోనే ఉద్యోగ అవకాశాలు



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసిన టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా తదితరులు

కాచిగూడ: కష్టపడి పనిచేసే తత్వం భారత్‌లోని యువత సొంతమని ఈ నేపథ్యంలోనే వారంతా ప్రపంచ వ్యాప్తంగా వివిధ సంస్థల్లో ఉన్నత పదవుల్లో కొనసాగుతున్నారని టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా అన్నారు. 'బంకత్‌లాల్ బద్రుకా కాలేజ్ ఫర్ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ' వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం కాచిగూడలోని బద్రుక కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. అవకాశాలను సద్వినియోగం చేసుకొని నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. సామాజిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలన్నారు. నేటి ప్రపంచంలో అత్యంత ముఖ్యమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులను కోరారు. ఆల్‌రౌండ్ టాపర్లకు బంగారు, రజత పతకాలు, సర్టిఫికెట్లను ప్రదానం చేసి జ్ఞాపికలను అందజేశారు. శ్రీలక్ష్మినివాస్‌శర్మ, శ్రీ కిషన్ బద్రుక, రవి బద్రుక, రాజేంద్రకుమార్, ప్రొఫెసర్ అభిరామకృష్ణ, డీఎస్ఎస్ మూర్తి, పీవీవీ కార్తీక, సత్యరవళి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తా !



హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ కరపత్రాన్ని ఆవిష్కరించిన అనిల్‌కుమార్‌యాదవ్

చిక్కడపల్లి: సికింద్రాబాద్ జిల్లా పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీని పూర్తిస్థాయిలో పటిష్టం చేస్తానని నూతనంగా ఎంపికైన జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్లో అనిల్‌కుమార్‌యాదవ్‌ను ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ పక్షాన పోటీ చేసే అభ్యర్థులను టీపీసీసీ అధ్యక్షుడు తో సంప్రదింపులు జరిపాకే జరుగుతుందని తెలిపారు. ప్రధానంగా పార్టీని పటిష్టం చేయడమే తన లక్ష్యమని తెలిపారు. అందర్నీ కలుపుకు పోతూ ముందుకు సాగుతానని వెల్లడించారు. జూన్ రెండవ తేదీన రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ జరుగుతుందని తెలిపారు. పోటీలలో ఎవరైనా పాల్గొనవచ్చని, విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు ఉంటాయని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో వచ్చే మహిళలకు ఎలక్ట్రిక్ స్కూటర్స్ బహుమతి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గజ్జెల రిషికేశ్వర్, బి.అనిల్ యాదవ్, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శీలం సత్యనారాయణ, అభిషేక్ కెన్నడి, సంఘపాక వెంకట్, ఎంబి కృష్ణయాదవ్, జయ, అంజియాదవ్, మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్ ఇతరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


కాచిగూడ: ముదిరాజ్‌ల అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.10వేల కోట్లతో ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. ముదిరాజ్ చైతన్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బీసీ దళ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముదిరాజ్ చైతన్యవేదిక వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లకు సామాజిక న్యాయం జరగడం లేదన్నారు. మహిళా సాధికారతలో భాగంగా మహిళలకు పరిపాలనలో భాగస్వామ్యం కల్పించాలని పేర్కొన్నారు. చెరువులపై హక్కులు ముదిరాజ్‌లకు కల్పించాలన్నారు. ముదిరాజ్‌లపై జరిగే దాడులను అరికట్టాలని అన్నారు.

- నెల 28న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించే ముదిరాజ్ చైతన్యవేదిక సభలో ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.
- ముదిరాజ్‌లు ఆర్థిక సావలంబన సాధించి సమాజంలో సామాజిక, రాజకీయ అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. శివముదిరాజ్, కోట్ల పుష్పలత, రాజేష్ బండి, కృష్ణ, ప్రవీణ్, డీపీచారి తదితరులు పాల్గొన్నారు.




వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు

గొప్ప ప్రజాస్వామికవాది పుచ్చలపల్లి సుందరయ్య



మాట్లాడుతున్న లోక్‌సభ పూర్వ సెక్రటరీ జనరల్ పీడీటీ.ఆచారి తదితరులు



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పించిన ఎం.దశరథ్ తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: దేశంలో గొప్ప ప్రజాస్వామికవాది పుచ్చలపల్లి సుందరయ్య అని లోక్‌సభ పూర్వ సెక్రటరీ జనరల్ పీడీటీ.ఆచారి కొనియాడారు. పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని పార్లమెంట్‌లో సైతం తన గళాన్ని పేదల పక్షాన వినిపించిన గొప్ప వ్యక్తి అన్నారు. శుక్రవారం సాయంత్రం సుందరయ్య కళానిలయంలో " భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం-సవాళ్లు, రాజ్యాంగ విలువలు" అనే అంశంపై పుచ్చలపల్లి సుందరయ్య 38వ స్మారకోపన్యాసం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న పీడీటీ.ఆచారి మాట్లాడుతూ.. మనది ప్రపంచంలో అతిపెద్ద లిఖిత రాజ్యాంగం అని రాజ్యాంగ నిర్మాతలు ఈ దేశానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే మెరుగైన పరిపాలన చట్టం అని తీర్మానించారన్నారు ఎస్‌వీకే ట్రస్ట్ చైర్మన్ బీవీ.రాఘవులు, ఎస్‌వీకే ట్రస్ట్ సభ్యులు సాంబిరెడ్డి, కార్యదర్శి ఎస్.వినయ్ కుమార్ తదితరులున్నారు.

ముషీరాబాద్: వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేసిన గొప్ప నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య సీపీఎం ముషీరాబాద్ జోన్ కార్యదర్శి దశరథ్ కొనియాడారు. శుక్రవారం పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతి సీపీఎం ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా దశరథ్ మాట్లాడుతూ.. 17 ఏళ్ల ఎమ్మెల్యే, 10 ఏళ్ల పార్లమెంటు సభ్యుడిగా ప్రజాసేవ చేసిన గొప్ప నాయకుడన్నారు. భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసి వెనకబడిన కులాలకు న్యాయం జరిగేలా కృషి చేసిన సుందరయ్య ఆశయాలకు అనుగుణంగా సీపీఎం పార్టీ పనిచేస్తుందన్నారు. సీపీఎం నగర కమిటీ సభ్యురాలు పద్మ, ముషీరాబాద్ జోన్ కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీరాములు, నాయకులు నర్సింహ, అంజనేయులు తదితరులున్నారు.


ఔత్సాహిక క్రీడాకారులకు వేసవి శిక్షణ శిబిరాలు



క్రీడాకారులకు వాలీబాల్‌లను అందిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి

అంబర్‌పేట: ఔత్సాహిక క్రీడాకారులకు జీహెచ్‌ఎంసీ శిక్షణ శిబిరాలు ఎంతగానో దోహదపడుతాయని బాగ్‌అంబర్‌పేట్ కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి తెలిపారు. జీహెచ్‌ఎంసీ వేసవి శిక్షణ శిబిరాల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు శుక్రవారం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో వాలీబాల్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాజీ కార్పొరేటర్ జ్ఞానేశ్వర్‌గౌడ్, బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకటరెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బీజేపీ నేత సలంద్రి రమేష్‌యాదవ్ మృతి



సలంద్రి రమేష్ యాదవ్

కవాడిగూడ: మహంకాళి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు సలంద్రి రమేష్‌యాదవ్(51) గుండెపోటుతో శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందారు. దీంతో ఆయన నివాసం వద్ద విషాదచాయలు అలముకున్నాయి. భార్య సుజాత, కూతురు అంశ్రిత, కుమారుడు నియాన్ష్ ఉన్నారు. బూత్ స్థాయిలో 1986 నుంచి బీజేపీ సామాన్య కార్యకర్తగా కొనసాగారు. ఆ తర్వాత దోమలగూడ డివిజన్ బీజేపీ మోర్చా అధ్యక్షుడు, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు, బీజేపీ నగర కార్యవర్గ సభ్యుడు, ప్రస్తుతం మహంకాళి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులుగా పార్టీ కోసం అహర్నిశలు కృషి చేశారు. గత మూడు రోజులుగా ఏషియన్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. తిరిగి ఇంటికి వచ్చిన క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో కుటుంబసభ్యులు తిరిగి ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. అంత్యక్రియలు శనివారం ఉదయం 12గంటల ప్రాంతంలో నిర్వహిస్తున్నట్లు సమాచారం. బీజేపీ కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, బీజేపీ రాష్ట్ర నాయకులు పరిమళ్‌కుమార్, వెంకటేష్ సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, రమేష్‌రాం, డివిజన్ బీజేపీ అధ్యక్ష కార్యదర్శులు ఎంపీ మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్‌గంగపుత్ర, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌ముదిరాజ్, హరీష్‌గౌడ్, అనిల్, శివరాజ్ నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.